అటవీ భూమిపై అక్రమార్కుల కన్ను

- కేసులైతేనే పోడు భూమి దక్కుతుందని మధ్యవర్తుల తప్పుడు ప్రచారం
- ఇబ్బందులు పడుతున్న అమాయకులు

ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో నరికివేతకు గురైన అటవీ భూమి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 22: అటవీ భూమిపై అక్రమార్కుల కన్నుపడింది. పోడు భూములకు హక్కులిస్తామని ప్రభుత్వాలు ప్రకటించిన నేపథ్యంలో కొందరు బ్రోకర్లు అటవీ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. గ్రీన్ ఏరియా పెంచాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన హరితహారం సత్ఫలితాన్నిచ్చింది. అటవీ భూమి కబ్జాపై సీరియస్‌గా పరిగణించి అటవీ సంరక్షణకు కబ్జారాయుళ్లపై కొంత కఠినంగా వ్యవహరించింది. అయితే అధికారంలోకి వస్తే.. పోడు భూములకు పట్టాలిప్పిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడంతో పోడు రైతులు తమ భూములకు పట్టాలు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే అదనుగా సిరిసిల్ల ఏరియా పరిధిలో కొందరు బ్రోకర్లు, కబ్జారాయుళ్లు పోడు భూమి అర్హాన్నే మార్చే పనిలో పడ్డారు.

కేసులైతేనే భూమి అంటూ ప్రచారం

అటవీ భూమిని కబ్జా చేసేందుకు కొందరు మధ్యవర్తులు అమాయక గిరిజనులు, గిరిజనేతరులను మభ్యపెడుతున్నారు. ఎంక్రోచ్‌మెంట్ (కబ్జా) విషయంలో కేసులైతేనే భవిష్యత్‌లో తాము నరికివేసిన అటవీ ప్రాంతం పోడు భూమిగా దక్కుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీంతో చట్టం తెలియని అమాయక గిరిజనులు మధ్యవర్తుల వలలో పడి కేసుల పాలవుతున్నారు. దీనికి తోడు కొందరు స్థానికులే బేస్ క్యాంపు సిబ్బందిగా ఉండడం, అటవీ శాఖలో సైతం కొందరు తమ సొంత గ్రామాలకు దగ్గరగా విధుల్లో ఉండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు అటవీ గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇటీవల స్థానికుల సాయంతో ఓ అటవీ శాఖ అధికారి సైతం ఎంక్రోచ్‌మెంట్‌కు కారణమై సస్పెండ్ కావడం గమనార్హం.

అరకొర సిబ్బందితో..

సిరిసిల్ల రేంజ్ పరిధిలోని 20సెక్షన్స్‌లో సిబ్బంది ఉండాల్సిన దానికన్నా తక్కువగా ఉండడంతో పర్యవేక్షణ కష్టతరమవుతున్నట్లు సమాచారం. సిరిసిల్ల పరిధిలోని సిరిసిల్ల, పెద్దలింగాపూర్, చీర్లవంచ మూడు బీట్‌లకు గానూ ముగ్గురు ఎఫ్‌బీవోలు ఉండాల్సి ఉండగా, కేవలం ఇద్దరు ఎఫ్‌బీవోలు, ఒక ఎఫ్ఎస్‌వో, గంభీరావుపేటలో గోరింట్యాల, గంభీరావుపేట, లింగన్నపేట, ముచ్చర్లలో నాలుగు బీట్లకు నలుగురు ఎఫ్‌బీవోలు ఉండాల్సి ఉండగా ఒక డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కేవలం ఒక్కరే బీట్ ఆఫీసర్‌తో కలిసి విధులు నిర్వర్తిస్తున్నారు. వెంకటాపూర్‌లో వెంకటాపూర్, అక్కపల్లి, శివంగాలపల్లి, పల్లె నిజామాబాద్ నాలుగు బీట్లకు ఒక డీఆర్‌వో కేవలం ఇద్దరు బీట్ ఆఫీసర్లు, అల్మాస్‌పూర్‌లో అల్మాస్‌పూర్, రంగంపేట, కంచర్లలో ఒక్కరు కూడా బీట్ ఆఫీసర్ లేకుండా ఒకే ఒక్క ఎఫ్ఎస్‌వో విధులు నిర్వర్తిస్తుండడం ఇబ్బందికరంగా మారింది. వీర్నపల్లిలో మద్దిమల్ల (దక్షిణం), మద్దిమల్ల (ఉత్తరం), వీర్నపల్లికి మూడు బీట్లకు ఒక సెక్షన్ ఆఫీసర్ ఇద్దరు బీట్ ఆఫీసర్లతో, గొల్లపల్లిలో గొల్లపల్లి, గుండారం, తిమ్మాపూర్‌లో మూడు బీట్లకు సెక్షన్ ఆఫీసర్, ఇద్దరు బీట్ ఆఫీసర్లతో విధులు నిర్వర్తిస్తున్నారు.

దీర్ఘకాలిక సెలవుల్లో సిబ్బంది..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించిన పలువురు యువతీ, యువకులు తొలిరోజుల్లో బాగానే విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ రానురాను కొంత ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తున్నది. పని ఒత్తిడి, 24గంటల డ్యూటీతో కుటుంబానికి సమయం కేటాయించలేక పోతున్నామని భావిస్తున్న వారు డ్యూటీని సక్రమంగా చేయలేకపోతున్నట్టు తెలుస్తున్నది. దీంతో మరో ఉద్యోగం కోసం కొత్త నోటిఫికేషన్ రాగానే ప్రిపరేషన్‌పై వెళ్తుతుండగా, ఉన్న స్టాఫ్‌పై భారం పడుతున్నట్లు కొందరు అధికారులు చెబుతున్నారు. గతేడాది ఏడెనిమిది మంది దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి వచ్చారు. ప్రస్తుతం మరో నోటిఫికేషన్ వస్తే మళ్లీ అదే తంతు మొదలయ్యే అవకాశం ఉన్నది.

అక్రమార్కులను వదలం

అటవీ భూమి కబ్జా చేసే ప్రయత్నం చేసే ఎవ్వరినీ వదలబోం. కొందరు ఎంక్రోచ్‌మెంట్ చేసినందుకు కేసులైతేనే భూమి దక్కుతుందనేది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇది వరకే ఆ ప్రయత్నం చేసిన కొందరిపై చర్యలు తీసుకున్నాం. పోడు భూమికి సంబంధించి గిరిజనులైతే 2005 కంటే పూర్వం సాగులో ఉండి పట్టా రాకపోతే, గిరిజనేతరులైతే మూడు తరాలు (75 సంవత్సరాలు) సాగులో ఉంటేనే హక్కు పత్రాలకు అర్హులనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ.. ఎక్కడా విధుల్లో రాజీపడడం లేదు.

– శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్వో సిరిసిల్ల

ఆర్థిక సంక్షోభంలో వస్త్ర పరిశ్రమ

- తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్
- అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్షకు సంఘీభావం

దీక్షకు సంఘీభావం తెలుపుతున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్

సిరిసిల్ల టౌన్, జూలై 22: ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోయిందని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి కోల్పోయిన ఇప్పటికే పది మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రిలే దీక్షలకు మద్దతుగా మంగళవారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో, 25న సిరిసిల్ల పట్టణ బంద్, 26న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేంద్రం జీఎస్టీ విధించడంతో వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గురైందన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి నేతన్నల మీద ప్రేమ ఉంటే ప్రధాని మోడీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ

వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రిలే నిరాహార దీక్షకు సంఘీభావం

సిరిసిల్ల టౌన్, జూలై 22: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో భాగంగా మొదటి రోజు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ మాట్లాడుతూ, సిరిసిల్ల నేతన్నల బతుకమ్మ చీరల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నేతన్నలకు విద్యుత్ సబ్సిడీని అందించాలన్నారు. గతంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ క్లాత్ బ్రాండ్‌గా ఉండేదని, సొంతంగా మార్కెట్ చేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బతుకమ్మ చీరల బకాయిలను వడ్డీతో సహా చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలువురు అధికారుల బదిలీలు

వేములవాడ రూరల్, జూలై 22: వేములవాడ, వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయాల్లో పలువురు అధికారులు బదిలీఅయ్యారు. వేములవాడ మండల ఎంపీవో శ్రీధర్ బోయినపల్లికి, జూనియర్ అసిస్టెంట్ వినయ్ ఇల్లంతకుంట మండలానికి బదిలీ అయ్యారు. వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రమేశ్‌తోపాటు అటెండర్ శ్రీనివాస్ తంగళపల్లికి బదిలీపై వెళ్లారు. తంగళ్లపల్లిలో పని చేస్తున్న విజేందర్‌రెడ్డి వేములవాడకు సూపరింటెండెంట్‌గా బదిలీపై రానున్నారు. అలాగే వేములవాడ మండల పశు వైద్యాధికారి ప్రశాంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. దాదాపు 13ఏండ్లుగా ఇక్కడ పశు వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు అందుకున్నారు. ప్రశాంత్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో వేములవాడ వైద్యాధికారి పోస్ట్ ఖాళీ కానున్నది.

వేములవాడ మున్సిపల్‌లో ఐదుగురు..

వేములవాడ, జూలై 22: మున్సిపల్ కార్యాలయంలో ఐదుగురు ఉద్యోగులు బదిలీ అయినట్లు మేనేజర్ సంపత్‌రెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా సీనియర్ అసిస్టెంట్ రవీందర్ కరీంనగర్ కార్పొరేషన్‌కు, అకౌంటెంట్ రాములు కామారెడ్డికి, జూనియర్ అకౌంటెంట్ రాజకుమార్ సిరిసిల్లకు, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య సిరిసిల్లకు, బిల్ కలెక్టర్ సురేశ్ సిరిసిల్లకు బదిలీ అయ్యారని చెప్పారు. వేములవాడ పురపాలక సంఘానికి బదిలీ అయిన ఉద్యోగులు మంగళవారం విధుల్లో చేరనున్నట్టు ఆయన తెలిపారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

సిరిసిల్ల రూరల్, జూలై 22: తంగళ్లపల్లిలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జనరల్ డిగ్రీ ఫస్ట్ ఇయర్ స్పెషల్ డ్రైవ్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రేహనఫత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి జనరల్ డిగ్రీలో సీబీసీఎస్ విధానంలో ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్, బీకాం సీఏ, బీఏ కోర్సులలో ప్రవేశాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం నంబర్‌న (9182351238) సంప్రదించాలని సూచించారు.

మొక్కలు నాటి కాపాడాలి: విప్ ఆది శ్రీనివాస్

మారుపాకలో మొక్క నాటి నీరు పోస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూలై 22: వన మహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. మారుపాక, అనుపురం, రుద్రవరం గ్రామాల్లో సోమవారం వన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించగా, విప్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, మానవ మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యమని, మొక్కలను కాపాడుకుంటే భవిష్యత్‌తరాలకు మంచి వాతావరణం అందించిన వాళ్లం అవుతామన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్, ప్రజాప్రతినిధులు పిల్లి కనకయ్య, ముడికే చంద్రశేఖర్, ఎర్రం రాజు, ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఊరడి రాంరెడ్డి, స్వామి, కనకయ్య, సత్తయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌కు 1,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బోయినపల్లి, జూలై 22: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి 1,850క్యూసెక్కుల వరద వస్తున్నదని ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మూడు రోజులుగా పడుతున్న ముసురుతో వరద జలాశయానికి వస్తున్నదని చెప్పారు. జలాశయంలో 27.54 టీఎంసీ నీటి సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 5.75టీఎంసీలు నిల్వ ఉన్నట్టు తెలిపారు. 62 క్యూసెక్కులు దిగువకు వదిలినట్టు చెప్పారు.

అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

కలెక్టరేట్, జూలై 22: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టవద్దని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారని తెలిపారు. ఆయా శాఖల నుంచి మొత్తం 101 దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన కేంద్రం ఏర్పాటు

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక చొరవతో ప్రజా పాలన కౌంటర్ ఏర్పాటు చేయగా, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ రాని ప్రజలు లోటుపాట్లను సరిదిద్దుకుని మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రజా పాలన కేంద్రం ఏర్పాటు చేసిన కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ, జీపీల్లో పని చేస్తున్న సిబ్బందికి గత ఐదారు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఇచ్చేదే తక్కువ వేతనాలు అయినా.. నెలల తరబడి ఇవ్వకపోవడంతో ఆర్థిక భారం పడి కార్మికుల కుటుంబాలు అప్పులపాలై చివరకు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన చెందారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలని, రూ.5లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇక్కడ ముదిగంపల్లి అనిల్, అచ్చ కాంతయ్య, సింగారపు రాజు ఉన్నారు.

చందుర్తి: దాశరథి చిత్రపటాన్ని చూపిస్తున్న విద్యార్థులు

దాశరథి జయంతి

ఎల్లారెడ్డిపేట, జూలై 22: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాశరథి రంగాచార్యుల జయంతిని నిర్వహించారు. సోమవారం జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ తెవిరసం వ్యవస్థాపక అధ్యక్షుడు వాసరవేణి పరశురాములు, ఉపన్యాసకులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

దాశరథి చిత్రాన్ని గీసిన విద్యార్థులు

చందుర్తి, జూలై 22: ఆశిరెడ్డిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మహా కవి దాశరథి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా, విద్యార్థులు దాశరథి చిత్రాలను గీశారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూలై 22: వర్షాకాలం ప్రారంభమైనందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సామాజిక కార్యకర్త దుంపెన రమేశ్ కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. అందరూ నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఇల్లంతకుంట, జూలై 22: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు సోమవారం శాలువా కప్పి సన్మానించారు. గురు పూజోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహేశ్‌చంద్ర, గాలిపెల్లి ప్రాథమిక పాఠశాలలో లక్ష్మీనర్సింహ స్వామి ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంసాపత్రం అందుకోగా, తోటి టీచర్లు సత్కరించారు.

సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

సమీకృత కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

కలెక్టరేట్, జూలై 22: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాం.. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశ కార్యకర్తలు రోడ్డెక్కారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివచ్చి సుమారు గంటపాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కూరపాటి రమేశ్, జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ, ప్రజలను కాపాడడం కోసం వారి ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా అహర్నిశలు కష్టపడి పని చేస్తున్న ఆశ కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నా.. ఆశ కార్యకర్తలపై పని భారం మోపడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణతో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, ఆశ యూనియన్ అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, భారతి, చంద్రకళ, లత, లావణ్య, పద్మ, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

ఆదర్శప్రాయురాలు చాకలి ఐలమ్మ

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ
- పెద్దలింగాపూర్‌లో ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, జూలై 22: వీరవనిత చాకలి ఐలమ్మ ఆదర్శ ప్రాయురాలని.. ప్రతిఒక్కరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. సోమవారం ఆయన పెద్దలింగాపూర్ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి, మాట్లాడారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు. చాకలి ఐలమ్మ పోరాట పటిమను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించాలని మాజీ సర్పంచులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేవారు. ఇక్కడ ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, రజక సంఘాల చైర్మన్ బస్వరాజు శంకర్, మాజీ సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ స్వప్న ఉన్నారు.

సీజనల్ వ్యాధులు అరికడుదాం

- మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి

సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేశ్

వేములవాడ, జూలై 22: మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకొని సీజనల్ వ్యాధులను అరికడుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పిలుపునిచ్చారు. వార్డు అధికారులు, శానిటేషన్ జవాన్లు, నీటి సరఫరా విభాగం సిబ్బందితో సోమవారం కార్యాలయంలో కమిషనర్ అన్వేశ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలో ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పాటిస్తూ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. శుక్రవారం డ్రై డే పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇక్కడ శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.

జూకంటి జగన్నాథంను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ కళ-చక్రపాణి

జూకంటి సేవలు అభినందనీయం

సిరిసిల్ల టౌన్, జూలై 22: సాహితీ రంగంలో ప్రముఖ కవి జూకంటి జగన్నాథం అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కొనియాడారు. ప్రతిష్టాత్మక దాశరథి సాహితీ పురస్కారం పొందిన జూకంటి జగన్నాథంను సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన ఇంటికెళ్లి చైర్‌పర్సన్ దంపతులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

రాజన్న సిరిసిల్ల, జూలై 22 (నమస్తే తెలంగాణ)/ ఇల్లంతకుంట: గంజాయి కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సోమవారం సిరిసిల్ల రూరల్ కార్యాలయంలో ఇల్లంతకుంట ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లికి చెందిన చింతలపల్లి నాగిరెడ్డి కరీంనగర్ పట్టణంలో వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. అక్కడ పద్మనగర్‌కు చెందిన గుర్రాల నిఖిల్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు గంజాయి తాగడానికి అలవాటుపడ్డారు. గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి తాగుతూ, ఇతరులకు విక్రయించేవారు. ఈ క్రమంలో సోమవారం ఇల్లంతకుంట మండలం వంతడుపులలో గంజాయి విక్రయించేందుకు రాగా, పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 100గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా గంజాయి తాగినా, విక్రయించినా వెంటనే డయల్ 100కి గానీ, టాస్క్‌ఫోర్స్ సీఐ ఫోన్ నంబర్ (8712656392) కి గానీ కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డుపై కూలిన చెట్లు.. తొలగించిన ఎస్ఐ

వీర్నపల్లి, జూలై22: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం ప్రజా రవాణాకు తీవ్ర అంతరాయం కలిగించింది. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎల్లాగౌడ్ సిబ్బందితో చెట్లను తొలగించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చేయించారు.

ఐఐటీ అడ్వాన్స్‌లో ప్రతిభ

కోనరావుపేట, జూలై 22: నిమ్మపల్లికి చెందిన విస్లావత్ అజయ్ ఐఐటీ అడ్వాన్స్ పరీక్షలో ప్రతిభ కనబర్చాడు. ఆల్ ఇండియా స్థాయిలో ఎస్టీ కేటగిరీలో 101ర్యాంక్ సాధించి ఉత్తరాఖండ్‌లో బీటెక్ చదివేందుకు ఎంపికయ్యాడు. అజయ్ హైదరాబాద్ నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి 983మార్కులు సాధించారు. దీంతో అజయ్ తల్లిదండ్రులు వాల్యనాయక్-అరుణ సంతోషం వ్యక్తం చేశారు.

మహిళకు అసభ్య మెస్సేజ్‌లు

రుద్రంగి, జూలై 22: స్నాప్‌చాట్ ఫేక్ ఐడీతో గ్రామంలోని మహిళకు అసభ్య మెసేజ్‌లు ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు. తన పేరుతో స్నాప్‌చాట్ ఫేక్ ఐడీ క్రియేట్ చేసి.. గ్రామంలోని ఓ మహిళకు అసభ్య మెసేజ్‌లు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రుద్రంగికి చ